


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 05-01-2024 సంపుటి : 06 సంచిక : 116 పేజీలు : 8 వెల : రూ 3-00




## ఏపీ లో ఫిబ్రవరి 2న ఎలక్షన్ కోడ్ 3 కోట్ల 69 లక్షల మంది ఓటర్లు

ఆంధ్రప్రదేశ్ ఎలక్షన్ కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలుస్తుంది. 2024 ఫిబ్రవరి 2న ఎన్నికల కోడ్ ప్రకటించే అవకాశం ఉంది. మార్చి 6న ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపధ్యంలో రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచార వేగాన్ని పెంచారు. ఏపీలో విమర్శలు ప్రతి విమర్శలు మధ్య ఎన్నికల సంఘం నూతన ఓటర్ల లిస్టు తయారుచేసింది. తన కార్యక్రమాలు ముమ్మరం చేసింది.ఓ వైపు ఈవీఎం ల మీద అవగాహన కల్పిస్తూ, మరో వైపు ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదలెట్టింది.ఇక తాజాగా ఏపీలో వున్న ఓటర్ల సంఖ్యని ఎన్నికల సంఘం రిలీజ్ చేసింది.ఇక ఎన్నికల సంఘం లెక్కల ప్రకారం ఏపీలో సుమారు 3 కోట్ల 69 లక్షల 33 వేల 91 మంది ఓటర్లు వున్నట్లు తెలుస్తుంది.ఇక ఇందులో పురుషుల ఓటర్లు 1,83,24,588 మంది వుండగా, మహిళలు 1,86,04,742 మంది వున్నారని తెలుస్తుంది, ఇక థర్డ్ జెండర్ ఓటర్స్ 3,761 మంది వున్నారని ఎన్నికల సంఘం లెక్కల్లో పేర్కొంది.ఇక రాష్ట్రంలో అత్యధికంగా చంద్రగిరి నియోజకవర్గంలో ఓటర్లు వుండగా, అత్యల్పంగా నర్సాపురం నియోజకవర్గంలో వున్నారని ఎన్నికల సంఘం నిర్ధారించింది

# వైఎస్ షర్మిల రాకతో కాంగ్రెస్ పార్టీ బలపడుతుంది

## జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కే బాబురావు..



విభారె న్యూస్ జనవరి 04 కర్నూలు (జిల్లా ప్రతినిధి)..శ్రీమతి వైయస్ షర్మిల రాకతో ఆంధ్ర ప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ బలపడుతుందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కే బాబురావు అభిప్రాయపడ్డారు. గురువారంజిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బాబురావుమాట్లాడుతూఅఖిలభారత కాంగ్రెస్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గౌరవనీయులు మల్లికార్జున ఖర్గే జాతీయ ప్రియతమ నాయకుడు రాహుల్ గాంధీ సమక్షం లో ఢిల్లీలో శ్రీమతి వైఎస్ షర్మిలమ్మ కాంగ్రెస్ పార్టీలో చేరడం కాంగ్రెస్ పార్టీకి శుభపరిణామని రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముందు గా పార్టీ కార్యాలయం ముందు నాయకులు, కార్యకర్తలతో కలిసి బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకు న్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఈ లాజరస్,పిసిసి ఉపాధ్యక్షులు మహబూబ్ మున్న, డిసిసి కార్యదర్శి యజాస్అహ్మద్, మైనార్టీసెల్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఖాద్రిపాషా పత్తి కొండ కాంగ్రెస్ నాయకు లు ఏవి నాయు డు,పులికొండకాంగ్రెస్నాయ కులు బిసుబ్రహ్మణ్యం రాజేంద్ర ప్రసాద్, నవీద్ మొదలు వారు పాల్గొన్నారు.

# కాళేశ్వరలో బిజెపి వాటా నిరూపించాలి


**సిబిఐ విచారణ ఎందుకు కోరడం లేదు**
**అభయహస్తం దరఖాస్తుల పేరుతో టైమ్‌పాస్ట్**
**రాహులోకు ప్రధాని ఛాన్స్ లేదన్న కిషన్ రెడ్డి**



హైదరాబాద్,జనవరి4 ): కాళేశ్వరంలో బీజేపీకి వాటా ఉందని చేసిన ఆరోపణలపై మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు కిషన్ రెడ్డి కాంగ్రెస్‌కు దమ్ముంటే నిరూపించాలన్నారు. లంకెబిందెలు కోసమే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారా? అని ప్రశ్నించారు. కాళేశ్వం అవినీతి విషయంలో కేసీఆర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం రక్షిస్తోందని ఆరోపించారు. కేసీఆర్‌కు తాను కాదు.. కాంగ్రెస్ పార్టీనే బినామీ అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ బిచాణా ఎత్తివేస్తదని.. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే చెత్తబుట్టలో వేసినట్లే అని అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం హోదాలో రేవంత్ రెడ్డి కాళేశ్వరంపై సీబీఐ విచారణ ఎందుకు కోరటం లేదని ప్రశ్నించారు. నిర్మాణాత్మకమైన సూచనలు చేస్తే.. కాంగ్రెస్ నేతలు అహంకారంతో తనపై వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారన్నారు. అప్లికేషన్ల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం టైమ్ పాస్ చేస్తోందని విమర్శించారు. అభయహస్తం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న దరఖాస్తు లో ఏదో మతలబు ఉందని అనుమానం వ్యక్తం చేశారు. దరఖాస్తులతో ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదనే విషయం తెలుసు.. అయినా రేషన్ కార్డు అడుతున్నారని మండిపడ్డారు. తలెంగాణ ఉద్యమకారులు ఎఫ్ఐఆర్ కాపీలు పెట్టాలా?.. ఉద్యమకారులు అరెస్టై జైలుకు వెళ్లిన వివరాలన్నీ ప్రభుత్వం దగ్గరనే ఉన్నాయి.. మళ్లీ ఎఫ్ఐఆర్ కాపీలు అడగడమేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే.. ఎలాంటి దరఖాస్తులు లేకుండా అర్హులైన లబ్దిదారులందరికీ పథకాలు అమలు చేయాలని కిషన్ రెడ్డి అన్నారు. రేవంత్ రెడ్డి ఏ విధంగా ఆదాయం సంపాదించారో ప్రతీ తెలంగాణ బిడ్డకు తెలుసన్నారు. ముఖ్యమంత్రి ప్రస్థానం ఎలా మెదలైందో.. తన ప్రస్థానం ఎలా మెదలైందో తెలంగాణ ప్రజలకు తెలుసన్నారు.

# ఎన్నికల సన్నద్దతపై కార్యాచరణ

**అధికారులతో సిఎస్ జవహర్ రెడ్డి సమీక్ష**
**పటిష్ట ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశం**



అమరావతి,జనవరి4 : సాధారణ ఎన్నికలు పటిష్ట నిర్వహణపై ఇప్పటి నుండే కార్యాచారణ సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఏపీ సచివాలయంలో సాధారణ ఎన్నికలపై సీఎస్ కేఎస్ జవహర్ రెడ్డి కీలక సమావేశం నిర్వహించారు. రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు సహా ఎన్నికల విధులతో నేరుగా సంబంధం ఉన్న వివిధ అధికారుల ఖాళీల భర్తీ చేయాలని సీఎస్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం, జిల్లా ఎన్నికల అధికారుల కార్యాలయాల్లో అవసరమైన సిబ్బంది కేటాయింపు అంశాలపై సీఈఓ ముఖేష్ కుమార్ మీనాతో సీఎస్ చర్చించారు. వెంటనే సిబ్బంది నియామకానికి ప్రతిపాదనలను పంపాలని సీఇవోను సీఎస్ కోరారు.కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల విధుల నిర్వహణతో సంబంధం ఉండి ఒకే ప్రాంతంలో మూడు నాలుగేళ్ళ సర్వీసు పూర్తి చేసుకున్నఅధికారులు తప్పనిసరి బదిలీ చేయాలని సీఎస్ తెలిపారు. కొత్తవారికి పోస్టింగులు వంటి వాటిపై కూడా వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సీఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఉండాల్సిన కనీస సౌకర్యాలకు సంబంధించిన అంశాలపై సీఇఓతోపాటు ఇతర అధికారులతో సీఎస్ సమీక్షించారు. రానున్నఎన్నికల్లో డబ్బు, మద్యం వంటివి అక్రమ రవాణా నియంత్రణకు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందితో అంతర్ రాష్ట్ర సరిహద్దుల్లో ఇంటిగ్రేటెడ్ చెక్కు పోస్టుల ఏర్పాటుపై చర్చించారు. సరిహద్దు నిఘా ముఖ్యంగా ఏపీ, ఒడిస్సా రాష్ట్ర అధికారులతో త్వరలో ఒక సమన్వయ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. రానున్నసాధారణ ఎన్నికల నిర్వహణపై పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, విద్యా, మున్సిపల్ తదితర శాఖలు ఇప్పటి నుండే తగిన కార్యాచరణ సిద్ధం చేసు కోవాలన్నారు. 'ఎన్నికల రెండు రోజుల పర్యటన నిమిత్తం ఈనెల 9వ తేదీన రాష్ట్రానికి వస్తుంది. 10న విజయవాడలో సీఎస్, డీజీపీ, సీఇఓ సహా ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, ఆర్ అండ్బి, అటవీ, విద్యా తదితర శాఖల ఉన్నతాధికారులతో సమీక్షిస్తుంది.

# చెంచుల అభివృద్ధికి చర్యలు తీసుకోండి

**జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్**



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 04 - జిల్లాలో చెంచులు నివాసం ఉంటున్న ప్రాంతాలు, వారి జీవన ప్రమాణాలు పెంపొందించి అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వ గిరిజన సంక్షేమ మంత్రిత్వ శాఖ చేపట్టిన జనజాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ కార్యక్రమం ఉపకరిస్తుందని జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ పేర్కొన్నారు.బుధవారం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం నుండి ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కార్యక్రమంపై సంబంధిత గిరిజన ప్రాంతాల జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.కలెక్టర్ ఛాంబర్ నుండి జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ తో పాటు ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్ డా. రవీంద్రారెడ్డి, డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, డ్వామా పిడి రామచంద్రారెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, సంబంధిత 14 మండలాల ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ జిల్లాలోని 14 మండలాల పరిధిలోని 42 చెంచుగూడాలలో దాదాపు 8750 మంది గిరిజనులు నివసిస్తున్నారని... వారి జీవన ప్రమాణాలను పెంపొందించి అభివృద్ధిలోకి తెచ్చేందుకు నోడల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 11అంశాలకు సంబంధించి హౌసింగ్, గ్రామీణ నీటి సరఫరా, రోడ్లు, మొబైల్ మెడికల్ యూనిట్లు, అంగన్వాడీ కేంద్రాలు, హాస్టల్స్, మల్టీ పర్పస్ సెంటర్స్, మొబైల్ టవర్ల ఏర్పాటు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షంచి పలు ఆదేశాలు జారీ చేశారు. చెంచుల ప్రాంతాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర అంశాలపై ఈ నెల 15వ తేదీలోగా నివేదికలు అందజేయాలని సంబంధిత నోడల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# జయహో బీసీ బహిరంగ సదస్సులో పాల్గొన్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఏవిఆర్ ప్రసాద్

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 04 తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం గుంటూరు మంగళగిరిలో జయహో బీసీ బహిరంగ సదస్సు గురువారం జరిగింది. టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చేమనాయుడు, జయహో బిసి ఇంచార్జి కొల్లు రవీంద్రతో పాటు పలువురు బిసి నాయకులతో సదస్సు జరిగింది. టిడిపి రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా, ప్రొద్దుటూరు అసెంబ్లీ టిడిపి పరిశీలకునిగా ఏవిఆర్ ప్రసాద్ జయహో బీసీ సదస్సులో పాల్గొన్నారు. జయహో బీసీ సదస్సు వేదికపై జాతీయ అధ్యక్షుడు శ్రీ నారా చంద్రబాబు నాయుడుతో పాటు పలువురు టిడిపి ముఖ్య నాయకులతో కలిసి వేదికపై నాకు అవకాశం కల్పించడం పట్ల టిడిపి అధిష్టానానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్లు ఏవి ఆర్ ప్రసాద్ ఓ ప్రకటన లో తెలిపారు.



# సంపాదకీయం

శుక్రవారం 05-01-2024

## జనం కోసం పనిచేసే వారికే జనబలం !

జనగళం మేమే..జనబలం మేమే. గులాబీదళం..పార్లమెంటులో ఉండాల్సిందే.. ఓటమి తరవాత ఇప్పుడు గులాబీ దళానికి ప్రజలు గుర్తుకు వస్తున్నారు. ప్రజలకు మేమే అండ అని చాటుకోవాలని తపన పడుతు న్నారు. అయినా అహంకారం వీడినట్లుగా కానరావడం లేదు. తమ తప్పుల వల్లనే ఓటమి చెందా మని యువరాజావారు భావించడం లేదు. చేసిన తప్పులపై సమీక్ష చేసుకుని ఉంటే బాగుండేది. కానీ కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వంపై అప్పుడే నిందలు వేసే పనిలోపడ్డారు. నిలదీసే చర్యలకు పూనుకుంటున్నారు. మేడిగడ్డ అక్రమాలపై చీమకుట్టినట్లు లేదు. విద్యుత్ అప్పులపైనా నిజాలు చెప్పడం లేదు. అప్పుల చిట్టా విప్పితే ఆస్తులు సంపాదించి పెట్టామని గొప్పలు చెబుతున్నారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వలేకనానా తిప్పలు పెట్టారు. 20 ఏళ్లనాటి జర్నలిస్టుల భూ సమస్యను పరిష్కరించలేదు. సుప్రీం తీర్పు ఇచ్చినా ఖాతరు చేయలేదు. రైతుబంధు లాంటి పథకాలతో వేలకోట్లు దుర్వినియోగం చేశారు. దళితబంధులోనూ అదే జరిగింది. వీటిపై విచారణ జరపాలన్న డిమాండ్‌ను సిఎం రేవంత్ రెడ్డి పట్టించుకుంటారా లేదా అన్నది చూడాలి. ఇకపోతే కాళేశ్వరంపై సిబిఐ విచారణ చేయించాలని సన్నాయి నొక్కులు నొక్కుతున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బిజెపి నేతల తీరు కెసిఆర్‌ను రక్షించే ఎత్తుగడ తప్ప మరోటి కాదు. సిబిఐకి అప్పగిస్తే.. ఏం జరుగుతుందో తెలియంది కాదు. అందువల్ల పదేళ్ల పాపాలపై రాష్ట్రంలోనే విచారణ జరగాలి. ఇన్ని పాపాలు చేసి..ఓడిపోయాక కూడా ఆత్మపరిశీలన చేసుకోకుండా అహంకారం ప్రదర్శించే నేతలు అవసరమా అన్నది ప్రజలు ఆలోచన చేయాలి. అలాగే ఇలాంటి వారు మన నాయకులని చెప్పుకోవడానికి సిగ్గుపడాలి. సమీక్షల పేరుతో ఇప్పుడు పార్లమెంటులో అడుగు పెట్టడం ఎలా అని ఆలోచన చేస్తున్నారు. ఆధునిక రాజకీయాల్లో రాటుదేలడమన్నది అంత సులువు కాదు..ప్రజల ఆదరణ పొందడం అన్నదీ మరీ అంత సులవూ కాదు...ప్రజల నాడి తెలుసుకోవాలి. ప్రజల్లో ఆదరణ పొందాలి. ఓట్ల కోసం కాదు..జనం కోసం ఆరాటపడే తపన అన్నది ఎంతమందిలో ఉంటుంది. ప్రజలంతా పార్టీలకు అతీతంగా తమ నాయకు డు ఫలానా అని చెప్పగలిగిన వారు ఎంతమంది ఉంటారు..? అలా ప్రజల గుండెల్లో గూడుకుట్టు కుంటే అంతకుమించిన అదృష్టం ఉంటుందా..? అలా ఎంతమంది చేస్తారు..ఎంతమంది జనం నాడి పడతారు... ఎంతమంది జనం గుండెచప్పుడు అవుతారు...అలా జనం గెండెచప్పుడుగా మారుతారు. ఇవీన్ని ఉన్నాయని నమ్మి తెలంగాణ ఉద్యమంలో ప్రజలంతా కెసిఆర్‌ను తమ నాయకుడిగా గుర్తించి తలపైకి ఎత్తుకున్నారు. తెలంగాణ యావత్ సమాజం కూడా కెసిఆర్ వెంటే నడిచారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత కూడా రెండుసార్లు అధికారం కట్టబెట్టారు. కానీ జరిగిందేమిటి..?ప్రజలతో నాకు పనిలేదన్నారు. సిఎంను కలవాల్సిన అవసరం ప్రజలకు ఏమిటని ప్రశ్నించారు. నేనే తెలంగాణ తెచ్చానని తలపొగరు ప్రదర్శించారు. నిస్వార్థ రాజకీయాలను ఔపోసన పట్టే వారు ఎంతమంది...? ప్రజలతో ఓట్లు వేయించుకుని..వారిని దూరం పెట్టి..ఎన్నికల ముందు వంగివంగి సలామ్ కొట్టే ఈ రోజుల్లో అరుదైన నేతలూ ఉన్నారు. అలాంటి వారిలో ఒడిశా సిఎం నవీన్ పట్నాయక్ ముందుంటారు. జనం గుండె చప్పుడుగా మారుతున్నారు. వారి కాలుకు ముల్లు గుచ్చుకుంటే తీయలేకపోవచ్చు..కానీ వారికి నేనున్నాననే ధైర్యం..భరోసా ఇవ్వగలిగే నాయకుల్లో తప్పకుండా ఉండేవారు అరుదుగా కనిపిస్తారు. అలాంటి వారిలో చప్పున చెప్పుకునే నేత నవీన్ పట్నాయక్. అంతెందుకు మనదగ్గర ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కూడా అలాంటి వారి కోవలోకే వస్తారు. కానీ ధరణిలో ఆయన భూమి కూడా ఆగమయ్యిందని తెలిసాక...కెసిఆర్ హయాంలో జరిగిన అకృత్యాలు తలచుకుంటేనే బాధేస్తోంది. ప్రజల సమస్యలను ఏనాడూ పట్టించుకోలేదు. తన ఫామ్ హౌజ్‌కు నీళ్ల కోసంకాళేశ్వరం డిజైన్ చేసుకున్న ఘనుడు కెసిఆర్. ప్రజదర్బార్‌లో వస్తున్న ఫిర్యాదులు చూస్తే బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన నిర్వాకమేమిటో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి వారిని నమ్మితే మళ్లీ గడీల పాలన తప్పదు. కానీ రేవంత్ రెడ్డి ఇప్పుడు సిఎం అయ్యాక చకచకా నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రజలకు చేరువయ్యే పనుల గురించి ఆలోచన చేస్తున్నారు. ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు. నిజానికి నేటి రాజకీయం కత్తి మీద సాములాంటిది. కాంగ్రెస్ లాంటి పార్టీలో ఓ వైపు అధినేతను మెప్పించాలి. పార్టీ ప్రభుత్వం ఇచ్చిన కార్యక్రమాలను ప్రజల చెంతకు చేర్చాలి. ప్రజల అభీష్టం కూడా నెరవేర్చాలి. ఈ రెండూ అంత సులవైన విషయాలు కావు. కానీ రెంటినీ అవలీలగా..త్రికరణశుద్ధిగా అమలు చేసే ధైర్యంతో..దమ్మున్న నేతగా ఎదగడమన్నది మన రేవంత్ రెడ్డికే దక్కింది. ప్రజలంటే ప్రేమ.. అధినేత అంటే ఆప్యాయత..ప్రజల్లో కలసిపోయి పనిచేసే తపన. ఇవన్నీ కలబోస్తే కనిపించే దృశ్యం రేవంత్ సంజీవయ్య అని చెప్పక తప్పదు. జనం గుండెచప్పుడు కావడం వల్లనే.. ప్రజలు తమ ఓటుతో నీవే మా నాయకుడి వని ఓటేసి నిరూపించారు. సామాన్యుడి నుంచి సిఎం పదవికి నేతగా ఎదగడం అన్నది సామాన్య విషయం కాదు. అందుకే పార్టీలకు అతీతంగా ప్రజలు ఆయనంటే ప్రత్యేక అభిమానం చాటుతున్నారు. నెలరోజుల్లోనే విలక్షణ శైలితో రేవంత్ ముందుకు సాగుతున్న తీరు ప్రజల్లో భరోసా కల్పిస్తోంది. పేదలకు మేలు జరిగేలా కార్యక్రమాలను తీసుకుని వెళుతున్నారు. అనేక పథకాలను పట్టాల కెక్కించే ప్రయత్నంలో ఉన్నారు. ఓట్లు వేయించుకుని...తాను ఎమ్మెల్యేగా గెలిచానని, సిఎంను అయ్యానని మిన్నకుంటే ప్రజలు ఎలా ఆదరిస్తారు.. అందుకే..నిరంతరం కృషి చేయాలి.

# పరిపాలనా సౌలభ్యం కోసమే సచివాలయాల వ్యవస్థ.. ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి





కోసిగి,జనవరి 04(విభారె న్యూస్) గ్రామాల్లో పరిపాలనా సౌలభ్యం కోసమే సియం జగన్ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మెల్యే శ్రీ వై బాలనాగిరెడ్డి అన్నారు. గురువారం కోసిగి మండలం వందగల్లు నందు యంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ నేతృత్వంలో సర్పంచ్ శ్రీమతి కాలువ కోరవంజమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన నూతన గ్రామ సచివాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల ఇంచార్జ్ శ్రీ పి మురళీ మోహన్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే శ్రీ వై బాలనాగిరెడ్డి పాల్గొన్నారు.ముందుగా ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి శిలాఫలకంనుఆవిష్కరించి,నూతన సచివాలయం నందు పూజలు నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ,గ్రామంలోని ప్రజానీకం మండల కార్యాలయాల చుట్టూ తిరగకుండా,పాలనా వ్యవస్థే మన గ్రామంలోనే ఉండే విధంగా వ్యవస్థను తీసుకొచ్చిన ఘనత సియం జగనన్నకే దక్కుతుందని ఆయన పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో పీఆర్ ఏఈ యుగంధర్ రెడ్డి,ఎపీఓ జయరాం,యంపీపీ ఈరన్న,ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షులు నరసింహులు,మహాంతేష్ స్వామి,యన్ నాగరాజు,బుళ్ళి నరసింహులు,షౌఖత్ అలీ వందగల్లు లక్ష్మయ్య, యంపీటీసి మల్లికార్జున, ఉస్మాన్, నరసింహులు గౌడ్, దొడ్డి నర్సన్న,దుద్ది రామలింగ, యం నరసింహులు, కాంట్రాక్టు నాగరాజు,సోఫీ తదితరులు పాల్గొన్నారు.

# గుడిపాడు గ్రామంలో బిజెపి జెండా ఆవిష్కరణ

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి**





కర్నూలు జిల్లా అధ్యక్షులు కునిగిరినీలకంఠ గూడూరు రూరల్ మండలం గుడిపాడు గ్రామం నందు బిజెపి కోడుమూరు అసెంబ్లీ కోకన్వీనర్ వేల్పులగోపాల్ సూచనలతో భారతీయ జనతా పార్టీ గుడిపాడు గ్రామ బూతు అధ్యక్షుడు రాజేష్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేయడం జరిగినది బిజెపి జాతీయ కిసాన్ మోర్చా ఇంఛార్జ్ (ప్రభారి) గా బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ ఎంపీ శ్రీబండిసంజయ్ కుమార్ నియమితులైన సందర్భంగా మరియు జెండా ఆవిష్కరణ చేసిన అనంతరం పంచిపెట్టడం జరిగినది ఈకార్యక్రమంలో గూడూరు రూరల్ మండల ప్రధానకార్యదర్శి రంగన్న నీలప్ప ఆవిష్కరణ చేయడం జరిగిన బూత్ కమిటీ సభ్యులు తిమ్మన్న మల్లకల్లు పూలరంగన్న దస్తగిరి మహేష్ హరీష్ గొల్లరాముడు కార్యకర్తలు గ్రామప్రజలు పాల్గొన్నారు.

# కోసిగి సిఐ ఏరీసా వలి బదిలీ

కోసిగి,జనవరి 04 (విభారె న్యూస్) కోసిగి సిఐ ఏరీసా వలి మంత్రాలయం సర్కిల్ కు గురువారం నాడు బదిలీ కావడం జరిగింది.ఆయన స్థానంలో కర్నూల్ విఆర్ లో ఉన్న ప్రసాద్ ను కోసిగి సిఐ గా పోలీస్ ఉన్నతాధికారులు నియమించినట్లు తెలిసింది.త్వరలో రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బదిలీలు జరిగినట్లు తెలిసింది.

# వైసీపీ ప్రభుత్వంలో బీసీల అన్యాయం.....



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- జనవరి 4 తెలుగుదేశం పార్టీ మంగళగిరి కేంద్ర కార్యాలయంనందు పార్టీ ఆదేశాలమేరకు గురువారం జయహో బిసి కార్యక్రమం వర్క్ షాప్ లో ప్యాపిలి తెలుగుదేశం మండల అధ్యక్షుడు గండికోట రామసుబ్బయ్య, డోన్ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి వలసల రామకృష్ణ పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షులవారు నారా చంద్రబాబునాయుడు ప్రస్తుత వైసిపి ప్రభుత్వం బీసీలకు చేస్తున్నటువంటి అన్యాయాలను మీరందరూ గ్రామాలకు వెళ్లి ప్రజలకి వివరించమని ఆదేశించినట్లు వారు తెలిపారు బీసీలకు తెలుగుదేశం ప్రభుత్వం హాయంలో 34 శాతం మొత్తానికి సంస్థలో ఉన్నటువంటి రిజర్వేషన్లను ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం 24% కుదించింది అనేకమందికి వేలాదిమందికి పదవులు రాకుండా అన్యాయం చేసింది అదే విధంగా 54 బీసీ కార్పొరేషన్ లో పెట్టి వారికి ఒక కుర్చీ ఒక టేబుల్ మాత్రమే ఇచ్చి ఎటువంటి నిధులు ఇవ్వకుండా బీసీలకు తీవ్ర అన్యాయం చేసింది ఈ విషయాలన్నీ గ్రామాలకు వెళ్లి ప్రభుత్వం యొక్క వైఫల్యాలను ప్రజలందరికీ వివరించి చైతన్య పరుసవలసిందిగా వారిని ఆదేశించినట్లు తెలిపారు.

# వైసిపిలో అవకాశం లేకే కాంగ్రెస్‌లో చేరిక

**షర్మిల చేరికతో మాకు వచ్చే నష్టం లేదు**
**ఎపి రాజకీయాల్లో ఆమె ప్రభావం ఉండదు**
**ఎవరు ఎక్కడ చేరినా విజయం మళ్లీ జగన్‌దే**
**వైసిపి నేత వైవి సుబ్బారెడ్డి వ్యాఖ్య**



అనకాపల్లి,జనవరి4 ): వైసీపీలో అవకాశం లేకే షర్మిల తెలంగాణలో కొత్త పార్టీ పెట్టుకుందని కాంగ్రెస్‌లో వైఎస్ షర్మిల పార్టీ విలీనంపై వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డి స్పందించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. న్నారు. అక్కడ ఉన్న రాజకీయ పరిస్థితులను బట్టి కాంగ్రెస్‌లో విలీన నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. షర్మిల తాజా నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కానీ, రాజకీయాలకు కానీ ఎలాంటి సంబంధం లేదని అన్నారు. షర్మిలతో సహా ఎవరు ఏ పార్టీ లో చేరినా, ఎన్ని పార్టీలు కలిసి కూటమిగా చేరినా ప్రజల ఆశీస్సులు జగన్‌పైనే ఉన్నాయన్నారు. జగన్ కాకుండా వేరే వాళ్ళు ముఖ్యమంత్రి అయితే పేద కుటుంబాలు నష్టపోతాయని అన్నారు. అందుకే ప్రజల ఆశీస్సులు తమతోనే ఉంటాయని స్పష్టం చేశారు. లోకేష్ నావ మునిగి పోయిందని.. జాకీలు వేసి లేపుతున్నారని.. అయినా లేవడం లేదని వైవీ సుబ్బారెడ్డి ఎద్దేవా చేశారు. ఎవరు ఏ పార్టీలో చేరినా తమకు వచ్చిన ఇబ్బంది ఏమీ లేదని సుబ్బారెడ్డి అన్నారు. ఏపీ ప్రజలు మరోసారి సీఎం జగన్‌నే సీఎం అవ్వాలని అనుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో జగన్ విజయం సాధిస్తారని అన్నారు. ఎవరు కూటములు కట్టినా తమకు ఏ మాత్రం భయం లేదని అన్నారు. షర్మిల వైసీపీలో చేరే అవకాశం లేకే షర్మిల తెలంగాణలో కొత్త పార్టీ పెట్టుకున్నారని అన్నారు. అక్కడ ఉన్న రాజకీయ పరిస్థితులను బట్టి ఆమె కాంగ్రెస్‌లో తన పార్టీని విలీనం చేయాలని నిర్ణయం తీసుకున్నారని వైవీ సుబ్బారెడ్డి అభిప్రాయపడ్డారు. షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరినట్లుగా ఎవరు ఏ పార్టీలో చేరినా.. ఎన్ని పార్టీలు మారినా తమకు వచ్చే ఇబ్బంది ఏమీ లేదని సుబ్బారెడ్డి అన్నారు. జగన్ కాకుండా మరొకరు ఏపీకి ముఖ్యమంత్రి అయితే పేద కుటుంబాలు నష్ట పోతాయని సుబ్బారెడ్డి అన్నారు. అందుకే ప్రజల ఆశీస్సులు తమకే ఉన్నాయని వైవీ సుబ్బారెడ్డి అన్నారు. లోకేశ్ నావ మునిగి పోయిందని అయినా జాకీలు వేసి లేపుతున్నారని ఎద్దేవా చేశారు. అయినా లోకేశ్ పైకి లేవడం లేదని వైవీ సుబ్బారెడ్డి మాట్లాడారు. వైఎస్ఆర్ సీపీలో పార్టీ అధిష్ఠానం గెలుపు కోసం చేస్తున్న మార్పుల గురించి కూడా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడారు. పార్టీ పరంగా కొన్ని నిర్ణయాలు తీసుకుంటున్నామని, అన్ని నియోజకవర్గాల్లో మార్పులు చేస్తున్నామని అన్నారు. ఇది కొంతమందికి నచ్చకపోవచ్చని.. కానీ పార్టీ మాత్రం గెలుపైనే ఫోకస్ చేస్తుందని వైవీ సుబ్బారెడ్డి అన్నారు.

# పూల మొక్కల పెంపకం సృజనాత్మక కళ

**మొక్కల పెంపకం ద్వారా ఆనందంతో పాటు ఆరోగ్యం**
**గృహాలంకరణలో మొక్కల పెంపకమూ ఓ భాగమే**
**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు**

విజయవాడ,జనవరి4 ):పూల మొక్కల పెంపకం ఓ సృజనాత్మక కళ అని.. హరితమయం, అంద మైన పూల వర్ణాలతో పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది.. అందమైన సమాజం లక్ష్యంగా, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవుతున్న రోజ్ సొసైటీ, హరితప్రియ ప్లాంట్ లవర్స్ సొసైటీ సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, హరిత ప్రియ ప్లాంట్ లవర్స్ సొసైటీ, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్, ఆంధ్రా నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 7వ రాష్ట్రస్థాయి అగ్రీ హార్టికల్చర్ షో, 6వ వార్షిక గులాబీ ప్రదర్శన, విక్రయ స్టాళ్లను సిద్దార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీ మైదానంలో జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు.. విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, నిర్వాహకులతో కలిసి గురువారం ప్రారంభించారు. ఆంధ్రా నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్, బొన్సాయి మొక్కలు, ఆఫ్ ప్లాంట్స్, గ్రీన్ హోమ్ ఆర్గానిక్ మెన్యూర్, ప్రజల భాగస్వా మ్యంతో ప్రకృతి వ్యవసాయం, ప్రకృతి ఉత్పత్తులు తదితరాలకు సంబంధించి మాట్లాడుతూ మొక్కల పెంపకంతో ఆహ్లాదంతో పాటు ఆరోగ్యం కూడా సొంతమవుతుందని పేర్కొన్నారు. ఇంటి ఆవరణలో పచ్చని మొక్కల మధ్య కొంత సేపు గడపడం ద్వారా రోజువారీ పనుల వల్ల కలిగే ఒత్తిడి నుంచి ఉపశమనం పొందొచ్చన్నారు.

# జగన్ నిర్ణయాలతో టిడిపి బెంబేలు

**పచ్చ పత్రికలో ఇష్టం వచ్చినట్లు రాతలు**
**బిసిలను బానిసలుగా చూసిన చంద్రబాబు**
**మంత్రి వేణుగోపాలకృష్ణ విమర్శలు**

విజయవాడ,జనవరి4(ఆర్ఎన్ఎ): సీఎం జగన్ తీసుకుంటున్న నిర్ణయాలకు టీడీపీ బెంబేలెత్తిపోతుందని మంత్రి వేణుగోపాలకృష్ణ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, చంద్రబాబు తన కుల పత్రికలో పిచ్చిరాతలు రాయిస్తున్నాడంటూ మండిపడ్డారు. ఇంత కాలం బీసీలను బానిసలుగా చూసిన పెత్తందారులు టీడీపీ నాయకులేనంటూ మంత్రి దుయ్యబట్టారు. టీడీపీ ఒక మోసపూరిత పార్టీ అని, ఎన్టీఆర్‌ని గద్దె దించడంలో చంద్రబాబుకి సహకరించిన వారందరూ మోసాల్లో వాటాదారులేనని ఆరోపించారు. అచ్చెన్నాయుడు, యనమల రామకృష్ణుడు, అయ్యన్నపాత్రుడు, బండారు సత్యనారాయణ లాంటి వారు ముందు వరుసలో ఉంటారు. ప్రజాస్వామ్య వాదులు బాధపడే భాషను టీడీపీ నాయకులు వాడుతున్నారు. 151 సీట్లతో ముఖ్యమంత్రి అయిన జగన్‌పై అచ్చెన్నాయుడు, బండారు సత్యనారాయణ వ్యాఖ్యలు ఎవరూ హర్షించరని మంత్రి మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సాధికార న్యాయానికి అర్థం చెప్పింది సీఎం జగన్. బలహీన వర్గాల ప్రజలను టీడీపీ నాయకులు బానిసలుగా చూశారు. పేదవాడిని పెత్తందారుల వద్దకు వెళ్లకుండా తలెత్తుకునేలా చేసింది సీఎం జగన్ మాత్రమే. గతంలో చంద్రబాబు పేదవాడి ఆరోగ్యం గురించి ఆలోచించిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీని ప్రవేశపెడితే కార్పొరేట్ హాస్పిటల్స్‌ని బాగుచేయడానికేనని చంద్రబాబు అన్నాడని మంత్రి గుర్తు చేశారు. ఎన్నికల ముందు బీసీలను మోసం చేయడానికి చంద్రబాబు వెనుకాడడు. రాజకీయాల్లో అధినాయకుడు తీసుకునే నిర్ణయాలకు కట్టుబడి ఉంటాం. సీఎం జగన్ ఎక్కడ నుంచి పోటీ చేయమంటే అక్కడ నుంచి చేస్తాం అని మంత్రి అన్నారు. సీఎం జగన్ వ్యూహాన్ని చూసి టీడీపీ భయపడుతుంది. బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు టీడీపీకి లేదు.రాజమండ్రిలో పవన్ కళ్యాణ్ వస్తే అచ్చెన్నాయుడిని పక్కకు నెట్టారు. అలాంటి పార్టీలో ఉండి బీసీల గురించి అచ్చెన్నాయుడు మాట్లాడితే ఎలా నమ్ముతారని అన్నారు.

# వదిలిన బాణమా... వదిలేసిన బాణమా...

విజయవాడ, జనవరి 4, సంక్షేమమే ఎజెండాగా ప్రజల్లోకి వెళ్లిన వైఎస్ జగన్ తను ఇచ్చిన మేనిఫెస్టోలో ప్రతీ వాగ్దానాన్ని నెరవేర్చానని పదే పదే చెబుతూనే వస్తున్నారు. ఆ కాన్ఫిడెన్స్‌తోనే వైనాట్ 175 అంటూ ఎలక్షన్‌కి వెళ్లటమే కాదు సిట్టింగ్‌లను మార్చేయటం, వారసులకు టికెట్లు ఇవ్వటం ఇలా చాలా అగ్రెసివ్ మోడ్‌లో ఉన్నారు. ఇలాంటి టైమ్‌లో షర్మిల తీసుకుంటున్న స్టెప్ తెలుగు రాష్ట్ర రాజకీయాల్లోనే సంచలనంగా మారనుంది. ఇది రెండోసారి అధికారంలోకి రావాలనుకుంటున్న జగన్ ఆశయానికి హర్డిల్ కానుందా. జగనన్న వదిలిన బాణంగా ఆ పార్టీ అధికారంలోకి రావటానికి సాయపడిన సొంత రక్తమే ఇప్పుడు బాకులా మారి విజయానికి అడ్డుపడనుందా. . ఇదే ఇప్పుడు ఏపీ పాలిటిక్స్‌లో హాట్ టాపిక్.మొన్నటి దాకా తెలంగాణ మాత్రమే తన పోరుగడ్డ అని బలంగా అరిచి చెప్పిన వైఎస్ షర్మిల ఇప్పుడు శరవేగంగా ఏపీ పాలిటిక్స్ వైపు కదులుతున్నారు. అది కూడా అధికారంలో ఉన్న తన అన్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా వేరే పార్టీలోకి. ఏ పార్టీతో అవమానాల పాలుపడ్డానని.. తమపై కక్షసాధించారని వైఎస్సార్ సెంటిమెంట్‌తో కాంగ్రెస్ నుంచి జగన్ బయటకు వచ్చారో ఇప్పుడు అదే పార్టీలోకి షర్మిల వెళ్తున్నార. ఢిల్లీ వెళ్లి రాహుల్, సోనియా గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతుండటం కచ్చితంగా జగన్‌కు మింగుడుపడని వ్యవహారమే. జగన్ జైలులో ఉన్నప్పుడు 2014కి ముందు వైసీపీ బాధ్యతలను భుజాన మోస్తూ సుదీర్ఘ పాదయాత్ర చేశారు షర్మిల. 2014 ఎన్నికల్లో టీడీపీని ఓడించాలని విస్తృతంగా ప్రజల్లో తిరుగుతూ పోరాడారు. కానీ టీడీపీ అధికారం కైవసం చేసుకోవటం, ఈలోగా జగన్‌కు బెయిల్ రావటంతో షర్మిల మెల్లగా యాక్టివ్ పాలిటిక్స్‌కు దూరమయ్యారు. తిరిగి 2019 ఎన్నికల టైమ్‌లో యాక్టివేట్ అయ్యారు. చంద్రబాబుకు వ్యతిరేకంగా బైబై బాబు అనే నినాదంతో మళ్లీ ప్రజల్లోకి వెళ్లారు. వైసీపీ 151సీట్లతో అఖండమైన విజయాన్ని సాధించింది.తన కష్టాన్ని అన్నగుర్తించి పార్టీలో కీలకపదవి అప్పగిస్తారని షర్మిల.. భావించగా అది జరగలేదు. ఈ లోగా జరిగిన వేర్వేరు పరిణామాలతో షర్మిల ఏపీ నుంచి బయటకు వచ్చి తెలంగాణలో వైఎస్సాఆర్ పేరు మీద వైఎస్సార్ తెలంగాణపార్టీని స్థాపించారు. తెలంగాణలో కేసీఆర్ తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రజావ్యతిరేకతను ఏకం చేస్తూ అనేక ఆందోళనలు, దీక్షలు చేశారు. తీరా ఎన్నికల టైమ్‌లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పోరాటం చేయలేక అలా అని పొత్తూ పొట్టుకోలేక బయట నుంచి సపోర్ట్ చేశారు. ఎన్నికల పోటీ నుంచి తప్పుకొని సంచలన నిర్ణయం తీసుకున్నారు. అప్పుడే షర్మిల కాంగ్రెస్ చేరతారనే ప్రచారం జరిగినా అది కాస్త ఆలస్యమై ఆఖరకు ఏపీ వైపు తిరిగింది.ఇప్పుడు షర్మిల కాంగ్రెస్‌లో తన అనుచరులతో కలిసి చేరుతున్నారు. షర్మిలకు ఏపీసీసీ చీఫ్ పదవి ఇస్తారని..ఎన్నికలకు వైఎస్సాఆర్ సెంటిమెంట్ తో షర్మిల కాంగ్రెస్ ను ఏపీలో లీడ్ చేస్తారని ఊహాగానాలు నడుస్తున్నాయి. వైఎస్ సెంటిమెంట్, క్రిస్టియన్ ఓట్ బ్యాంకు షర్మిల ప్రభావితం చేస్తారని అది ఆ వైసీపీకి డిస్ అడ్వాంటేజ్ అని అందరూ అనుకుంటున్నదే. మరికొంత మంది మాత్రం సెంట్రల్ లెవల్లో షర్మిల సేవలను వినియోగించుకోవాలని భావిస్తోందని అంటున్నారు. అందుకోసమే ఆమెకు పార్టీలో కీలకపదవితో పాటు రాజ్యసభ ఆఫర్ చేస్తారని మరో ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్‌లో చేరతాననే తన మాటకు కట్టుబడి తన అన్నకే వ్యతిరేకంగా వచ్చే ఎన్నికలకు వెళ్తారా అనేది ఇప్పుడు వైఎస్సాఆర్ సీపీ ని అంతర్మథనంలో పడేస్తున్న మిలియన్ డాలర్స్ క్వశ్చన్. ఒకవేళ వ్యతిరేకమైతే మాత్రం ఒకప్పుడు జగనన్న వదిలిన బాణమే ఇప్పుడు బాకులా మారి అన్న రాజకీయానికి అడ్డుపడుతుందా అనే అంశంపై అందరి ఆసక్తి నెలకొనింది.

# బెజవాడలో చిన్న- నాని మధ్య ఫైట్

విజయవాడ, జనవరి 4, ఎన్టీఆర్ జిల్లా టీడీపీలో అన్నదమ్ముల మధ్య వర్గపోరు మరోసారి తీవ్రస్థాయిలో బహిర్గతమైంది. తిరువూరు టీడీపీ సమన్వయ భేటీ వేదికగా కేశినేని నాని- కేశినేని చిన్ని వర్గీయులు బాహాబాహీకి దిగారు. ఈ నెల 7న తిరువూరులో టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను స్థానిక నేతలతో కలిసి కేశినేని బ్రదర్స్ వేర్వేరుగానే పర్యవేక్షించడం వర్గపోరుకు దారి తీసింది. ఫలితంగా.. కొందరు నేతలు నాని వర్గంగా.. మరికొందరు చిన్ని వర్గంగా విడిపోయారు. ఈ క్రమంలో.. తిరువూరు టీడీపీ ఇన్‌చార్జ్ దేవదత్తు ఏర్పాటు చేసిన సమీక్షలో గందరగోళం ఏర్పడింది. టీడీపీ సమన్వయ భేటీ ఫ్లెక్సీలో కేశినేని నాని ఫొటో లేకపోవడంతో ఆయన వర్గీయులు ఆగ్రహానికి గురయ్యారు. ఆందోళన వ్యక్తం చేస్తూ.. చిన్ని ఫ్లెక్సీని చించేశారు. చిన్నిని లోపలికి అనుమతించొద్దంటూ నాని వర్గీయులు ఆందోళనకు దిగడంతో టీడీపీ ఆఫీస్‌లో గొడవ జరిగింది.కేశినేని నాని, చిన్నీ వర్గాల మధ్య వాగ్వాదం.. పోటాపోటీ నినాదాలతో తిరువూరు టీడీపీ ఆఫీస్‌లో గందరగోళం నెలకొంది. నాని, చిన్నీ వర్గాలు ఒకరిపైఒకరు కుర్చీలు విసురుకున్నారు. తిరువూరు ఇన్‌ఛార్జ్ దత్తుపై కేశినేని నాని వర్గీయుల దాడి చేశారు. ఇక.. విషయం తెలుసుకున్న కేశినేని చిన్ని.. టీడీపీ కార్యాలయానికి చేరుకోగా.. ఆయన్ను అడ్డుకునేందుకు నాని వర్గం ప్రయత్నించింది. చిన్నిని లోపలికి రానివ్వబోమంటూ నినాదాలు చేశారు. దాంతో.. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. టీడీపీ ఆఫీస్‌పై కేశినేని నాని వర్గీయులు దాడి చేసి.. ఫర్నీచర్ ధ్వంసం చేశారు. ఆఫీస్ అద్దాలు పగలగొట్టారు. కొందరు టీడీపీ నేతలు సర్దిచెప్పే యత్నం చేసినా పరిస్థితి సర్దుమణగలేదు. దాంతో.. అదుపు చేసేందుకు పోలీసులు ప్రయత్నించగా వారిపైనా దాడికి దిగారు. టీడీపీ కార్యకర్తల పరస్పర దాడిలో తిరువూరు ఎస్సై సతీష్‌కు గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు.ఇక.. తిరువూరు ఘటనపై ఎంపీ కేశినేని నాని రియాక్ట్ అయ్యారు. వివాదానికి సమన్వయలోపమే కారణమని.. ఇలాంటివాటికి ఎక్కడో ఒకచోట ఫుల్‌స్టాప్ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. అటు.. తిరువూరు టీడీపీ ఇన్‌చార్జ్‌పైనా ఫైర్ అయ్యారు కేశినాని నాని. మొత్తంగా.. ఎన్టీఆర్ జిల్లా టీడీపీలో వర్గపోరు భగ్గుమంది. టీడీపీ కార్యకర్తలు, నేతలు.. నాని, కేశినేని వర్గాలుగా విడిపోయారు. అదేసమయంలో.. ఎంపీ కేశినాని నాని.. తిరువూరు టీడీపీ ఇన్‌చార్జ్ దత్తు టార్గెట్‌గా విమర్శలు చేయడం పార్టీలో ప్రకంపనలు రేపుతోంది.

# వారసులకు లైన్ క్లియర్...

తిరుపతి, జనవరి 4, (న్యూస్ పల్స్) చిత్తూరు జిల్లా పాలిటిక్స్‌లో వాళ్ళిద్దరూ రాజకీయాల్లో గురు శిష్యులు. అయితే ఒక్కసారిగా 2024 సార్వత్రిక ఎన్నికలకు దూరం అయ్యారు. ఇప్పుడు వాళ్ళ తనయులను రాజకీయ వారసులుగా వైసీపీ గుర్తించింది. తండ్రులను పక్కన పెట్టి తనయులను సమన్వయకర్తలను చేసింది. తిరుపతి జిల్లాలో ఆ ఇద్దరు యువ నాయకులకు పార్టీ బాధ్యతలను అప్పజెప్పిన వైసీపీ అధిష్టానం, 2024 సార్వత్రిక ఎన్నికల్లో బరిలోకి దింపాలని యోచిస్తోంది. కొత్త వారిని రాజకీయ వారసులుగా తెర మీదికి తెచ్చింది.తిరుపతి జిల్లా రాజకీయాల్లో గురు శిష్యులుగా ఉన్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి 2024 ఎన్నికల్లో కొడుకులను గెలిపించుకునేందుకు కష్టపడాల్సి వస్తోంది. తిరుపతి జిల్లా నుంచి నుంచి ఇద్దరు రాజకీయ వారసులకు వైసీపీ అధిస్టానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఇది అనివార్యం అయ్యింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీకి అవకాశం కల్పించింది వైసీపీ హై కమాండ్. తాజాగా ప్రకటించిన 27 మంది అభ్యర్థుల జాబితాలో చోటు కల్పించింది. ఇప్పటికే తండ్రికి తగ్గ తనయులుగా రాజకీయాల్లో దూకుడును ప్రదర్శిస్తున్నారు భూమన అభినయ్ రెడ్డి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి. వారి సేవలను గుర్తించిన వైసీపీ తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల సమన్వయకర్తలుగా ప్రకటించింది.2019 సార్వత్రిక ఎన్నికల్లో తిరుపతి ఎమ్మెల్యేగా రెండోసారి విజయం సాధించిన భూమన కరుణాకర్ రెడ్డి ఇక ఇవే ఆఖరి ఎన్నికలని ప్రకటించడం, ఆ తర్వాత వారసుడిగా భూమన అభినయ్ తిరుపతి రాజకీయాల్లో కీలకం అయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన భూమన అభినయ్ అభివృద్ధిలో కీలకంగా మారారు. తిరుపతి మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం యజ్ఞంలా చేపట్టిన అభినయ్ తిరుపతి నగర అభివృద్ధిలో జనంలో మార్కులు కొట్టేసే ప్రయత్నం చేశారు. గత ఆరు నెలల క్రితమే తిరుపతి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా దూకుడు పెంచిన అభినయ్ తిరుపతి పాలిటిక్స్ లో కీలకమయ్యారు. టీటీడీ చైర్మన్ గా భూమన కరుణాకర్ రెడ్డి అయ్యాక తిరుపతి అభివృద్ధి పరుగులు పెట్టించడంలో అభినయ్ కీలక పాత్ర పోషించాడు. ఈ నేపథ్యంలోనే వైసీపీ అధిష్టానం నిర్వహించిన రీజినల్ కోఆర్డినేటర్ల సమీక్ష లోనే తిరుపతి వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి భూమన అభినయ్ పేరును ప్రకటించింది. ఇప్పుడు అధికారికంగా భూమన అభినయ్ రెడ్డిని తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్తగా ప్రకటించింది.ఇక తిరుపతి జిల్లాలో మరో రాజకీయ వారసుడిగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని వైసీపీ అధిష్టానం గుర్తించింది. ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సీఎం జగన్ టీమ్‌గా పనిచేసేందుకు సిద్ధం కావడంతో 2024 సార్వత్రిక ఎన్నికలకు దూరమవుతున్నట్లు ప్రకటించి కొడుకును ఆశీర్వదించమని మోహిత్ రెడ్డిని తెరమీదకి తీసుకొచ్చారు. ఇందులో భాగంగానే ముందుచూపుగా స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుపతి రూరల్ ఎంపీపీగా ఏకగ్రీవ ఎన్నికకు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పావులు కదిపారు. అంతేకాకుండా తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ గా తన పదవీకాలం ముగియడంతో గత ఏడాది తుడా చైర్మన్ గా కూడా మోహిత్ రెడ్డి కి సీఎం జగన్ ఆశీస్సులతో అవకాశం కల్పించారు. తుడా చైర్మన్ గా టీటీడీ పాలక మండలి ఎక్స్ అఫిషియో సభ్యుడిగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి అవకాశం కల్పించిన తండ్రి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తన వారసుడిగా కొడుకుకు రెడ్ కార్పెట్ వేయించారు. ఒకవైపు పొలిటికల్ పవర్ తో పాటు గన్ మెన్ సౌకర్యం ఉన్న రెడ్డి చంద్రగిరి నియోజకవర్గంలో గడపగడపకు వెళుతున్నారు. చెవిరెడ్డి మోహిత్ రెడ్డి దూకుడును గుర్తించిన వైసీపీ అధిష్టానం చంద్రగిరి సమన్వయకర్తగా అవకాశం కల్పించింది. ఈ మేరకు తిరుపతి జిల్లాలో ఇద్దరికీ రాజకీయ వారసత్వాన్ని అప్పజెప్పిన వైసీపీ అధిష్టానం అసెంబ్లీకి పంపేందుకు సిద్ధమైంది.

# రఘువీరా...కనవేమిరా...

అనంతపురం, జనవరి 4, ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో అన్ని పార్టీలూ తమ అభ్యర్థులను సిద్ధం చేస్తున్నాయి. ప్రధానంగా టీడీపీ, వైసీపీ, జనసేన పార్టీలు అభ్యర్థుల ఎంపికలో తలమునకలై ఉన్నాయి. ఈసారి అధికారంలోకి రావడమే లక్ష్యంగా టీడీపీ కూటమి ప్రయత్నిస్తుండగా, వైసీపీ మరోసారి పవర్‌లోకి వచ్చేందుకు ఎడాపెడా అభ్యర్థులను మార్చేస్తుంది. అయితే కొన్ని చోట్ల కాంగ్రెస్ కూడా ఈసారి పట్టుబిగించేందుకు సిద్ధమవుతుంది. అందులో కల్యాణదుర్గం నియోజకవర్గం ఒకటి. ఈసారి మరలా కాంగ్రెస్ నుంచి రఘువీరారెడ్డి పోటీ చేస్తారన్న ప్రచారం ఊపందుకుంది. అయితే రఘువీరారెడ్డి పోటీ చేస్తే ఎవరికి లాభం? ఎవరికి నష్టం అన్న చర్చ జరుగుతుంది.కల్యాణదుర్గం నియోజకవర్గంలో నేతలు ఎక్కువే. అలాగే పార్టీలో అసంతృప్తులూ మామూలుగా ఉండవు. అది వైసీపీలో కావచ్చు. ప్రతిపక్ష టీడీపీలో కావచ్చు. రెండు పార్టీల్లో గ్రూపుల గోలకు కొరత లేదు. టిక్కెట్ల కోసం ప్రయత్నించేవాళ్లు ఎక్కువ మంది ఉన్నట్లే.. ఒకరికి టిక్కెట్ దక్కితే మరొకరు సహకరించుకోని పరిస్థితి కూడా ఈ నియోజకవర్గంలోనే చూస్తాం. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కల్యాణదుర్గం నియోజకవర్గంలో ప్రస్తుతం మంత్రి ఉషశ్రీ చరణ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే ఈసారి ఆమెకు టిక్కెట్ ఇవ్వబోమని అధినాయకత్వం తెలిపింది. ఉషశ్రీ చరణ్ ను పెనుకొండకు పంపాలని డిసైడ్ అయింది. దీంతో కల్యాణదుర్గం నుంచి శంకరనారాయణను పోటీకి దింపే అవకాశాలున్నాయి.మరోవైపు తెలుగుదేశం పార్టీలోనూ కల్యాణదుర్గం నియోజకవర్గంలో గ్రూపులున్నాయి. మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరితో టీడీపీ ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరనాయుడుల మధ్య విభేదాలున్నాయి. ఇద్దరూ మరోసారి సీట్ల కోసం ప్రయత్నిస్తున్నారు. అయితే ఎవరికి సీటు ఇస్తారన్న దానిపై ఇంత వరకూ క్లారిటీ రాలేదు. ఒకరికి సీటు ఇస్తే మరొకరు సహకరించుకునే పరిస్థితి సైకిల్ పార్టీలో లేదు. అనేక సార్లు రెండు గ్రూపులు కొట్టుకున్నాయి. ఈ నియోజకవర్గం టీడీపీకి పెద్ద తలనొప్పిగా మారింది. టీడీపీకి బలమైన నియోజకవర్గమిది. టీడీపీ ఆవిర్భవించాక ఐదు సార్లు విజయం సాధించింది. 2014లో ఇక్కడ టీడీపీ గెలిచినా.. 2019 ఎన్నికల్లో ఓటమి పాలయింది. అందుకోసమే ఈసారి ఇక్కడి నుంచి ఎవరు పోటీ చేస్తారన్న దానిపై ఇంకా పార్టీ అధినేత నిర్ణయం తీసుకోలేదు.ఈ పరిస్థితుల్లో కల్యాణదుర్గం నుంచి కాంగ్రెస్ మాజీ పీ?సీసీ చీఫ్ రఘువీరారెడ్డి పోటీ చేస్తారన్న ప్రచారం జరుగుతుంది. ఆయన కాంగ్రెస్ నుంచి 2009లో గెలుపొందారు. అప్పుడు మంత్రిగా పనిచేసిన రఘువీరారెడ్డి చేసిన అభివృద్ధి పనులు తిరిగి ఆయనను గెలిపిస్తాయన్న నమ్మకంతో ఆ పార్టీ ఉంది. దీంతో పాటు రఘువీరారెడ్డి గత కొంతకాలంగా తన సొంత గ్రామంలోనే ఉంటూ అనేక సేవా కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. నీలకంఠాపురంలో ఆలయాలను నిర్మించడమే కాకుండా అక్కడే నివాసం ఏర్పరుచుకుని సాదాసీదా జీవితం గడుపుతుండటం ఆయనకు ప్లస్ అవుతుందని చెబుతున్నారు. బీసీ కావడంతో అదనపు అడ్వాంటేజీ అవుతుంది. దీంతో రఘువీరారెడ్డి పోటీ చేస్తే టీడీపీకి లాభమా? లేదా వైసీపీకి లాభమా? అన్న చర్చ మొదలయింది. మరోసారి రఘువీరారెడ్డి కల్యాణదుర్గం నుంచి పోటీ చేయడం ఖాయమని చెబుతుండటంతో ఈ సీటు రాష్ట్రంలోనే హాట్ సీటుగా మారనుంది.

# బెజవాడ బ్రదర్స్ స్వయంకృత అపరాధం

విజయవాడ, జనవరి 4, అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఎమ్మెల్యే అభ్యర్థులను ఎంపిక చేస్తోన్న ఆ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి విజయవాడలో ఇద్దరు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఝలక్ ఇచ్చారు. ఇద్దరు ఎమ్మెల్యేల్లో ఒకరి టిక్కెట్ గల్లంతైతే మరొకరికి స్థాన చలనం తప్పలేదు. దీనికి వారి స్వయంకృతమే కారణమని ప్రచారం జరుగుతోంది. వైసీపీ నియోజక వర్గాల సమన్వయకర్తల మార్పులు చేర్పుల్లో విజయవాడలో ఇద్దరు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఎదురుదెబ్బ తగిలింది. విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్‌ను సెంట్రల్ నియోజక వర్గానికి మార్చారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు టిక్కెట్ నిరాకరించారు. టిక్కెట్ దక్కిన వెల్లంపల్లికి సంతోషం దక్కలేదు. సీటు కోల్పోవడంతో మల్లాది విష్ణుకు భంగపాటు తప్పలేదు.మల్లాది విష్ణు, వెల్లంపల్లి శ్రీనివాస్ ఇద్దరు 2009 ఎన్నికల్లో తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచారు. విష్ణు కాంగ్రెస్ పార్టీ తరపున గెలిస్తే, వెల్లంపల్లి ప్రజారాజ్యం నుంచి గెలిచి ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2014ఎన్నికల్లో ఇద్దరూ ఓడిపోయారు. 2019లో ఇద్దరు మళ్లీ వైసీపీ నుంచి గెలిచారు. సామాజిక సమీకరణల్లో భాగంగా వెల్లంపల్లికి మంత్రి పదవి కూడా దక్కింది. విష్ణు కూడా మంత్రి పదవి ఆశించినా బ్రహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ పదవితో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. మంత్రి వర్గ విస్తరణలో చోటు దక్కుతుందని భావించినా నిరాశ తప్పలేదు.వెల్లంపల్లి, మల్లాది విష్ణులపై విజయవాడలో తీవ్ర స్థాయిలో వ్యతిరేకత మూటగట్టుకున్నారు. మంత్రి పదవి దక్కిన తర్వాత వెల్లంపల్లి సొంత సామాజిక వర్గం తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకున్నారు.రకరకాల కారణాలతో విజయవాడ వ్యాపార వర్గాల్లో వెల్లంపల్లిపై అసంతృప్తి పెరిగిపోయింది. సొంత సామాజిక వర్గంపై వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి.ఇక అవినీతి ఆరోపణలు ఉన్న వారిని ప్రోత్సహించడం, నామినేటెడ్ పదవుల్లో క్రికెట్ బెట్టింగులకు పాల్పడే వారికి చోటు కల్పించడం, కాల్ మనీ వ్యాపారాలు చేసే వారికి అండగా నిలవడం వంటి విమర్శలు తీవ్రమయ్యాయి. నాలుగున్నరేళ్లలో నియోజక వర్గంలో పెద్దగా అభివృద్ధి చేయలేకపోవడం మైనస్‌గా మారింది.టౌన్ ప్లానింగ్ విభాగాన్ని చెప్పు చేతల్లో పెట్టుకుని నిర్మాణదారులపై వేధింపులకు పాల్పడ్డారనే విమర్శలు ఉన్నాయి.కార్పోరేషన్‌లో చీఫ్ ప్లానర్‌గా సుదీర్ఘ కాలం తన అనుచరుడిని ఉంచడం ద్వారా అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి.వెరసి స్థానికంగా ఆయన గెలవడం ఖాయమని తెలిసి మరో నియోజక వర్గానికి మార్చాల్సి వచ్చిందని చెబుతున్నారు.విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుపై కూడా తీవ్ర స్థాయిలో ఆరోపణలు ఉన్నాయి. నగరంలో కార్పొరేషన్ కోట్ల రుపాయల ఖర్చుతో నిర్మించిన ఫుడ్ కోర్టులో స్టాళ్లకు అనుమతుల విషయంలో విష్ణుపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు వచ్చాయి. రైతు బజార్లలో స్టాళ్ల కేటాయింపులో సైతం ఎమ్మెల్యే జోక్యం చేసుకున్నారని ప్రచారం జరిగింది. ఇళ్ల నిర్మాణం, టౌన్ ప్లానింగ్ అనుమతుల విషయంలో ఎమ్మెల్యే అనుచరుల తీరుతో సామాన్య ప్రజలు విసిగిపోయారు.ఇక కార్పొరేషన్‌లో ఆధిపత్య పోరు కూడా విష్ణుపై వ్యతిరేకత పెరగడానికి కారణం అయ్యింది. సెంట్రల్ నియోజక వర్గం పరిధిలోని డివిజన్ల కార్పొరేటర్లలో కొందరు నేరుగా వైసీపీ కీలక నేతల వ్యాపారాల్లో భాగస్వాములుగా ఉండటం కూడా విష్ణు అవకాశాలను గండికొట్టింది. గత ఎన్నికల్లో కేవలం 25ఓట్లతో గెలిచిన అభ్యర్థి కావడంతో ఈసారి గెలవడం కష్టమేనని భావించి టిక్కెట్ నిరాకరించినట్టు చెబుతున్నారు.

# పాపం...గుడివాడ అమర్నాథ్...



విశాఖపట్టణం, జనవరి 4, ఏపీ పొలిటికల్ సర్కిల్లో మంత్రి గుడివాడ అమర్నాథ్ ట్రోల్ అయినట్టు.. మరే నాయకుడు కాలేదు. కోడి ముందా? గుడ్డు ముందా? అన్న కామెంట్ తో సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ట్రోల్ అయ్యారు. అది మొదలు ఆయన ఏం మాట్లాడినా క్షణాల్లో వైరల్ అవుతుంది. నేటిజెన్లకు ఆకట్టుకుంటుంది. ప్రతి అంశాన్ని విశ్లేషించి మాట్లాడినట్టే కనిపిస్తారు కానీ.. ఎందుకు అమర్నాథ్ అంటే ఒక రకమైన భావన ఏర్పడింది. చివరకు ఇంటర్వ్యూలు చేసేవారు సైతం ఆయన ఫీలింగ్స్ ను చూసి నవ్వుకోక తప్పడం లేదు. అయితే నిన్నటి వరకు వైసిపి లో అభ్యర్థుల మార్పు విషయంలో చాలా రకాలుగా మాట్లాడారు. మార్పు జాబితాలో తన పేరు ఉండేసరికి ఆయనకు నోట మాట రావడం లేదు. కక్కలేక .. మింగలేని పరిస్థితి ఆయనది.అనకాపల్లి కి కొత్తగా భరత్ కుమార్ అనే నేతను ఇన్చార్జిగా నియమించారు. వచ్చే ఎన్నికల్లో ఆయన పోటీ కన్ఫర్మ్ అయినట్టే. అయితే అమర్నాథ్ ను గాలిలో పెట్టారు. కనీసం ఎంపీగానో, పక్క నియోజకవర్గం ఇన్చార్జిగానో నియమించలేదు. అనకాపల్లిలో తన పరిస్థితి బాగాలేదని అమర్నాథ్ కు సైతం తెలుసు. ప్రభుత్వంతో పాటు తనపై వ్యతిరేకత పెరిగిందని.. వచ్చే ఎన్నికల్లో గెలవడం కష్టమని కూడా తెలుసు.అయినా సరే అతడు సినిమాలో బ్రహ్మానందం చేసే అతి మాదిరిగా చాలా విన్యాసాలు చేశారు. తనకు తాను బలవంతుడు నని చెప్పే ప్రయత్నం చేశారు. నిన్నటికి నిన్న దాడి వీరభద్రరావు పార్టీకి రాజీనామా చేస్తే ఎగతాళి చేసి మాట్లాడారు. ఇప్పుడు ఏకంగా తనకు ఒక నియోజకవర్గం లేకుండా పోవడంతో ఏం మాట్లాడాలో తెలియక సైలెంట్ అయ్యారు.అమర్నాథ్ చోడవరం, ఎలమంచిలి వంటి నియోజకవర్గాల పై ఆశలు పెట్టుకున్నారు. కానీ అక్కడ సీనియర్లు కరణం ధర్మశ్రీ, కన్నబాబు రాజులు ఉన్నారు. వారిని తప్పించి అమర్నాథ్ కు ఇవ్వడం వృధా ప్రయాస అన్నది జగన్ కు తెలిసినట్లు ఉంది. అందుకే హోల్డ్ లో పెట్టారు. కనీసం ఎక్కడ ఛాన్స్ ఇస్తారో కూడా హింట్ ఇవ్వలేదు. ఇప్పుడు అనకాపల్లి కి దూరం కావాల్సి వచ్చింది. సొంత నియోజకవర్గానికి కానివాడిగా మారిపోయారు. పోనీ చోడవరంలో వేలు పెడితే ధర్మశ్రీ ఊరుకోరు.. ఎలమంచిలి లో పెడితే కన్నబాబు రాజు కస్సుబుస్సు లాడుతారు. దీంతో కుడితి లో పడ్డ ఎలక మాదిరిగా అమర్నాథ్ పరిస్థితి అయిపోయింది.అమర్నాథ్ కు అనకాపల్లి పార్లమెంట్ స్థానం నుండి పోటీ చేయిస్తారని ప్రచారం జరిగింది. అది కూడా ప్రకటన లేదు. అటు చోడవరం, ఇటు ఎలమంచిలి సీట్లు మారుస్తారని ప్రచారం జరిగినా.. అందులో కూడా స్పష్టత లేదు. అసలు మార్చే ఉద్దేశం ఉందా లేదా అన్న దానిపై క్లారిటీ లేదు. దీంతో పరిస్థితి ఏమిటన్నది ఆయనకే తెలియడం లేదు.

# పంచాయతీరాజ్ కార్యాలయాన్నిముట్టడించిన ఫీల్డ్ అసిస్టెంట్లు

అమరావతి,ఏపీ గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు యూనియన్ ఆధ్వర్యంలో 10 డిమాండ్ల పరిష్కారం కోరుతూ రాష్ట్రం నలుమూలల నుంచి తాడేపల్లి లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం వద్ద ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు తరలివచ్చారు. తమ డిమాండ్లు పరిష్కారం కోసం వినతి పత్రం అందజేసేందుకు వస్తే పోలీసులు కార్యాలయ గేట్లను మూసివేసి తమను దూరంగా తరిమివేశారని ఫీల్డ్ అసిస్టెంట్లు ఆరోపించారు.ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని, మండేస్ టార్గెట్ విధానం రద్దుచేసి అందరికీ ఎఫ్.టి.ఈ అమలు చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేసారు.ఏపీ గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు యూనియన్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం . ప్రారంభ ముఖ్య ఉద్దేశం గ్రామీణ పేదరిక నిర్మూలన వలసల నివారణలో భాగంగా గత 17 సంవత్సరాల నుంచి క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామపంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలి . అర్హత అనుభవం కలిగిన ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రమోషన్ ఇవ్వాలి. ఉపాధి కూలీలకు 200 రోజులు పని దినాలు రోజుకు వేతనం 600 కు పెంచాలని డిమాండ్ చేసారు.తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఏపీ గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు కమిషనర్ కార్యాలయం వద్దకు చేరు కోగా నే పోలీసులు కార్యాలయ గేట్లను మూసివేసి అడ్డుగా నిలబడ్డారు .

## గ్రామ దేవత శ్రీశ్రీ కాళికాదేవిని దర్శించుకున్న నరవ రమాకాంత రెడ్డి

పెద్దకడబూరు జనవరి 04 (విభారె న్యూస్) పెద్దకడబూరు మండలంలోని శ్రీశ్రీ కాళికాదేవి ఆలయములో అమ్మవారిక ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారు మృక్కులు తీర్చుకున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రైతు సాధికార ప్రతినిధి. నరవ రమాకాంత రెడ్డి అనంతరం ఆలయ పెద్దలు విశ్వబ్రాహ్మణ కేశవాచారినరసింహాచారిరెడ్డిగారికిపూలమాలతో సన్మానించి శ్రీ శ్రీ కాళికాదేవి అమ్మవారి ఆశీస్సులతో ఆయురారోగ్య ఐశ్వర్యాలతో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించాలని కోరారు. అనంతరం కేశవా చారి. నరసింహాచార్య కి రమాకాంతరెడ్డికి పూలమాలతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు కార్యక్రమములో ఆలయ పెద్దలు పాల్గొన్నారు. విశ్వబ్రాహ్మ ణులకు అన్ని విధాల తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూఉంటాయని నరవ రమాకాంత్ రెడ్డి తెలియచేశారు

## శ్రీ హరి హర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో 51 వ రోజు అన్న ప్రసాద వితరణ



విభారె న్యూస్ జనవరి 04 ఎమ్మిగనూరు.. స్వామియే శరణమయ్యప్పఅన్నదాన ప్రభువే శరణమయ్యప్ప ఆంధ్రప్రదేశ్ కర్నూల్ జిల్లా ఎమ్మిగనూరు శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం లో స్వాములకు (అన్నప్రసాద వితరణ)కార్యక్రమంలో భాగంగా ఈరోజు 51 వరోజు 04- 01- 2024 గురువారం దాతలుఎమ్మిగనూరు వాస్తవ్యులు1)బిళెహాల్ ఈరన్న శెట్టి శ్రీమతి శారదమ్మ ఎం. అశోక్ కుమార్ శ్రీమతి కీర్తన (అమెరికా) ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేసినారు .వారిని వారి కుటుంబాలకు శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి వారి.కృపా కటాక్షములు ఉండాలని,ఎల్లవేళలా ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలనిస్వామి వారిని ప్రార్థిస్తూఆ లయంలో అన్నదానం పెట్టదలచుకున్న దాతలు కమిటీ వారిని సంప్రదించి తగు తేదీలను నమోదు చేయించు కోగలరుఅదేవిధంగా అన్నదాన కార్యక్రమం విజయవంతం చేయాలని ,స్వామివారి కృపా కటాక్షము లు పొందగలరని కోరుతున్నాము..ఇట్లు - ఆలయకమిటీ సెల్: 9951801818.

## బహుళ అష్టమి సందర్భంగా ఘనంగా జరిగిన అనఘాష్టమి వ్రతం..



విభారె న్యూస్ జనవరి 04 కర్నూలు (జిల్లా ప్రతినిధి).గురువారం మార్గశిర బహుళ అష్టమి ప్రధాన అనఘాష్టమి సందర్భంగా శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో ప్రాతఃకాలంలో శ్రీ దత్తాత్రేయ స్వామి వారికి విశేష అభిషేకములు ప్రధాన అనఘాష్టమి వ్రతములు అత్యంత వైభవంగా జరిగినవి. ఈ కార్యక్రమములో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని. శ్రీ అనఘా దేవి సమేత అనఘా స్వామి వారి అనుగ్రహం పొందారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదం స్వీకరించారు..

# కోదండ రామాలయంలో అన్న పూర్ణోత్సవం



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 04 . ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా తిరుమలలో ప్రతి గురువారం జరిగే తిరుప్పావడ సేవ ( అన్న పూర్ణోత్సవం, అన్నకూటోత్సవం అని కూడా అంటారు ) కోదండరామాలయం ఆలయ ప్రాంగణంలో వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ఈ మాసంలో ఒక గురువారం చేస్తున్న సేవ ఈరోజు అనేక భక్తుల గోవింద నామస్మరణ చేస్తూ అత్యంత వైభవంగా జరిగినది.కర్నూలు నుండి వచ్చిన ప్రత్యేక బ్రాహ్మణ వంట వాళ్ళతో పులిహోర ను రాశిగా పోసి, అప్పం, తీపు జిలేబి, కారం జిలేబి, మినప వడలు, వివిధ కూరగాయల ముక్కలు, పూల మాలలు పండ్ల రకాలతో కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి రూపాన్ని అర్చక బృందం శ్రీకాంత్ శర్మ, తరుణ్ కుమార్ శర్మ గారి నేతృత్వంలో, మధుర వాగ్వసంత డా.. దివి హయగ్రీవ చార్యుల గారి దివ్య వ్యాఖ్యానంతో భక్తాగ్రేసరుల ఆనందం వర్ణనాతీతం, భక్తితో.. ఆర్తితో వారు స్వామి రూపాన్ని, చేసే విధానాన్ని మైమరిచి, పారవశ్యంతో పులకరించి పోయారు..9 మంది అర్చక బృందం స్వామి వారికి నివేదన, వేద పఠనం, సామూహిక ఆశీర్వచనం కనువిందుగా జరిగింది..మంగళ నీరాజనంపిదప వచ్చిన భక్తులందరికీ స్వామి రూపంలో నివేదించిన పులిహోర ను అందరికీ ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమం భగవత్ సేవా సమాజ్ అధ్యక్షులు సముద్రాల సూరయ్య కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు

# సచివాలయ ఉద్యోగులతో కాలువలు ఊడ్పించి,చెత్త ఎత్తిస్తారా......?



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- జనవరి 4 సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీల రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మె 24వ రోజు గురువారం స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో కొనసాగింది. తెలుగుదేశం పార్టీ డోన్ నియోజకవర్గ ఇన్చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి తదితరులు దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలియజేశారు. అనంతరంసిఐటియు జిల్లా కార్యదర్శ టి.శివరాం,పట్టణ అధ్యక్షులు నక్కిశ్రీకాంత్,సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు. పి. రామాంజనేయులు,ఏవి. భాస్కర్ రెడ్డి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు సులోచన, రహమద్బి,సుమలత మాట్లాడుతూ అంగన్వాడీలు 24 రోజులుగా రోడ్డున పడి సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోగా అంగన్వాడీలపై అబద్ధాలను ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వారన్నారు. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం చేయని ప్రయత్నం అంటూ లేదని అంగన్వాడీ సెంటర్ ల తాళాలు బద్దలు కొట్టించి సచివాలయ ఉద్యోగులతో పనులు చేయిస్తున్న జగన్మోహన్ రెడ్డి మున్సిపల్ కార్మికులు కూడా సమ్మె చేస్తున్నారు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సచివాలయ ఉద్యోగులతో కాలువలు క్లీన్ చేయించి,రోడ్లు ఊడిపించి, చెత్త ఎత్తిస్తారా అని ఎద్దేవా చేశారు.మరోవైపు అంగన్వాడీల సమస్యలు అన్నీ పరిష్కరించాము విధులలో చేరాలని అంటున్నారని ఇది ప్రజలలో అంగన్వాడీలపై వ్యతిరేక భావనను ప్రచారం చేయడంలో భాగమని అన్నారు.ప్రధాన డిమాండ్లపై తేల్చకుండా చివరి ఒకటి,రెండు డిమాండ్లను పరిష్కరించినంత మాత్రాన సమ్మె ఎలా ఆగుతుందని ప్రశ్నించారు.మరోవైపు పలానా సమయంలో గా ఉద్యోగాలలో చేరకుంటే ఉద్యోగాల నుండి తొలగిస్తామని ఉన్నతాధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారని మీ హెచ్చరికలకు,తాటాకు చెప్పులకు భయపడబోమని,రాబోవు ఎన్నికలలో ఈ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలని ప్రధాన డిమాండ్లపై తేల్చకుండా సమ్మెను ఆపే ప్రసక్తే లేదని ఇంకా ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడియూనియన్ నాయకురాళ్లు యశోద,లక్ష్మీస్వరి,సుభద్ర,ఆదిలక్ష్మి,రాజేశ్వరి, శ్యామల,ప్రమీల ,ధనలక్ష్మి,మాధవి,అరుణ, లక్ష్మీదేవి, మాసుంబి నాగలక్ష్మి,తదితరులు పాల్గొన్నారు

# మహిళా న్యాయవాదుల రిలే దీక్షకు మద్దతు తెలిపిన.. సుబ్బారెడ్డి



విభారే న్యూస్ డోన్ మాప్రతినిధి :- జనవరి 4 డోన్ పట్టణంలో కోర్టు దగ్గర జీవో నెం 512ను రద్దు చేయాలని 14వ రోజు మహీళా న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహారదీక్షకు సంఘీభావం తెలిపిన డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి అదేవిధంగా డోన్ పట్టణంలో 24వ రోజు ఏపీ అంగన్వాడీ వర్కర్స్, వెల్ఫేర్స్ మహిళలు చేస్తున్న నిరవధిక సమ్మె కు మద్దతు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీ లోకి చేరడం పట్ల హర్షం

## పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్ రావు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 04 – వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీ లోకి చేరడం పట్లపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్ రావు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించినపత్రికా సమావేశంలో మోహన్ రావ్ మాట్లాడుతూ దివంగత ప్రియతమ మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తనయ షర్మిల కాంగ్రెస్ పార్టీలోకి చేరడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ జగన్ మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మీద అభాండాలు మోపి తన చీకటి వ్యాపారాలు చేయడానికి మోడీతో చేతులు కలిపి దేశాన్ని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టాడని, నిజాలు తెలుసుకున్న షర్మిల దేశంలో అతి పెద్ద లౌకిక వాద ప్రజాస్వామ్య పార్టీలోకి చేరడం శుభ పరిణామమన్నారు. ఈ సందర్భంగా పార్టీకి దూరంగా ఉన్న నాయకులు, మేదావులు ప్రజాస్వామ్యవా దులందరూ పార్టీలోకి రావాలని ఆహ్వానం పలికారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య, జిల్లా కోశాధికారి ఎస్ వై డి ప్రసాద్, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి మస్తాన్ ఖాన్, మైనార్టీ నాయకులు ఫరూక్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు

# నంద్యాల టూ టౌన్ ఇన్స్పెక్టర్ గా రాజారెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 04 .. నంద్యాల టూ టౌన్ ఇన్స్పెక్టర్ గా కే. రాజారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా కడప జిల్లా పొద్దుటూరు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈక్రమంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతి భద్రతలో రాజీపడకుండావిధులు నిర్వహిస్తామని రాజారెడ్డి పేర్కొన్నారు.

## రాయలసీమ రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోం



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 04 .. రాయలసీమ రైతులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జ దశరథ రామిరెడ్డి తెలిపారు. గురువారం సమితి కార్యాలయంలో పాత్రికే యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను రైతుల తరపున పోరాటం చేస్తూ ఉంటే ప్రభుత్వం ఇటీవల తనను అరెస్టు చేసి జైలులో ఉంచడం జరిగిందన్నారు . అయితే తనకు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి తో పాటు, మాజీమంత్రి ఎన్ఎండి ఫరూక్, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి తదితరులు సంఘీభావం ప్రకటించడం జరిగిందన్నారు. వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గత ఏడాది అక్టోబర్ 6న రాయలసీమ రైతాంగానికి తీవ్ర అన్యాయం చేసే విధంగా చీకటి చట్టం తెచ్చిందన్నారు . ఇందు కోసం రైతులందరూ ఒక తాటి పైకి వచ్చి పోరాటం చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. సిద్దేశ్వరం అలుగునిర్మాణం, గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రామచంద్రారెడ్డి,వైె న్ రెడ్డి, కొండారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా కేంద్రాల ద్వారా కందుల కొనుగోలు

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 04 . ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా కందులు కొనుగోలు కార్యక్రమం చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి గురువారం అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందుకోసం రైతులు తప్పనిసరిగా రైతులు తాము సాగు చేసిన పంటను ఈ క్రాఫ్ చేయించుకోవాలన్నారు. కొనుగోలు చేసిన తర్వాత డబ్బులను రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు.

## అంగన్వాడీలు పొర్లు దండలు మద్దతు తెలిపిన ఎస్ ఎఫ్ ఐ



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 04- నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గం లో గత 24 రోజులుగా అంగన్వాడీ ల నిరవదిక సమ్మెకు ఎస్ఎఫ్ఐ నాయకులు బత్తిన ప్రతాప్ మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొర్లు దండలతో సీఎం జగన్ మోహన్ రెడ్డి మనసు మారి అంగన్వాడీ ల సమస్యలుపరిష్కారంచేయాలని కోరారు. సీఐటీయూ మండలం కార్యదర్శి భాస్కర్ , వెంకటమ్మ ఆధ్వర్యంలో గురువారం సమ్మెలో పొర్లు దండాలు తో నిరసన కార్యక్రమం చేయడం జరిగినది. ఈ కార్యక్రమం లో పలువురు సంఘీభావం తెలిపారు

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**